
గ్రేట్
అలెగ్జాండర్
తమిళ మూలం
ఆత్మారవి
ప్రజాశక్తి బుక్‌హౌస్

# 'గ్రేట్' అలెగ్జాండర్

తమిళ మూలం

**ఆత్మా రవి**

అనువాదం

**ఎజి. యతిరాజులు**


**ప్రజాశక్తి బుక్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

92762

ప్రచురణ సంఖ్య : 1256

ప్రథమ ముద్రణ : నవంబర్, 2012
ద్వితీయ ముద్రణ : నవంబర్, 2013

వెల : ₹.60

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్
website : www.psbh.in

# మహా అలెగ్జాండర్ పూర్వీకుల చరిత్ర

క్రీస్తుపూర్వం362లో యూరప్‌లోని ఏథెన్స్ నాగరికతలోనూ సాంస్కృతిక జీవనంలోనూ అత్యంత ప్రసిద్ధి చెంది అలరారుతోంది.

మాండినియా యుద్ధం తదనంతరం గ్రీసు పతనం చెందింది (పటంలో గ్రీసుదేశాన్ని చూడొచ్చు). ఆ కాలంలో థీప్స్ దేశంలో ఉమ్మడి పాలన సాగుతోంది. అయితే యుద్ధం వల్ల రాజ్యం అక్కడక్కడా విచ్ఛిన్నమై స్వయం పాలనలు జరుగుతున్నాయి. గ్రీసుదేశం సరైన నాయకత్వం లేక విభజనలకు గురవుతోంది. అయితే ఏథెన్స్ మాత్రం పటిష్టంగా ఉంది. అదీ స్వల్పకాలం మాత్రమే. ఉత్తరాదిన తిరుగుబాటు గావించిన మాసిడోనియన్ల కారణంగా అది అధికంగా ప్రభావితమయ్యింది. ఏథెన్స్ సముద్ర వాణిజ్యం చేసుకునేందుకు అడ్డంకిగా మాసిడోనియన్ల నావికాదళం పరిణమించింది. క్రమక్రమంగా మాసిడోనియా కరియా దేశం కన్నా బలం పుంజుకుని ఏథెన్స్‌కు వ్యతిరేకంగా విజృంభించింది. ఇలా ఏథెన్స్ నలువైపులా దిగ్బంధనానికి గురైన కాలంలోనే అంతర్గత కలహాలు కూడా పుంజుకున్నాయి. వీటన్నింటి ఫలితంగా ఏథెన్సు పూర్తిగా నీరసపడిపోయింది.

ఏథెన్స్‌ను పునర్ నిర్మించేందుకు 'తిమోథిస్' అనే ఆదేశపు రాజు ఇరుగుపొరుగు దేశాలతో సామరస్య ఒడంబడికలు చేసుకున్నాడు.

ఇందువల్ల ఏథెన్స్ థీప్స్‌ను కూడా జయించింది. కానీ ఈ ఉమ్మడి పాలనలో ఏథెన్స్ తన సర్వాధికారం ప్రదర్శించినందు వల్ల కరియా దేశం విడిపోయింది. మాసోలస్ ఆదేశ పాలకుడయ్యాడు. అతడే ఆనాడు బలమైన నావికాదళానికి అధిపతిగా ఉన్నాడు. ఇతడు రోట్స్, కాస్, గయాస్ మున్నగు దేశాలను కూడా ఏథెన్స్‌కు వ్యతిరేకంగా

## అలెగ్జాండర్ ది గ్రేట్ తూర్పు దండయాత్రలు (క్రీ.పూ. 334–325)






## అలెగ్జాండర్ ది గ్రేట్ సామ్రాజ్యం, దాని విచ్ఛిత్తి





అశ్వారూఢుడైన అలెగ్జాండర్

తిరుగుబాటు చేసేందుకు రెచ్చగొట్టాడు. దీని కారణంగా క్రీస్తుపూర్వం 357లో పైసాండియం అన్న చోట పెద్ద యుద్ధమే జరిగింది.

క్రీస్తు పూర్వం 353లోనే ఏథెన్స్ నుంచి లెస్‌పాస్, కార్గిరా ప్రదేశాలు సైతం విడిపోయాయి. ఆ దేశాలకు పుష్కలంగా ఆర్థిక సాయమందించి మాసోలస్ రాజు వాటిని తన నియంత్రణలో ఉంచుకున్నాడు. ఈ విధంగా ఏథెన్స్‌ను ఆరాజు పతనం అంచుకు తీసుకెళ్లిపోయాడు.

క్రీస్తు పూర్వం 354న అతడు చనిపోయాడు. (మాసోలస్ భార్య తన భర్త సమాధిని తదుపరి సంవత్సరం హాలీకార్నస్ అనే చోట నిర్మించింది. దీనికి 'మసోలియం' అని నామకరణం చేశారు. స్మృతి చిహ్నానికి 'మసోలియం' అనే పేరు ఆనాటి నుంచి వస్తోంది).

ఆనాటి నుంచి క్రమక్రమంగా ఏథెన్స్ క్షీణిస్తూ వచ్చింది. కారస్ అనే సైన్యాధిపతి అనవసరంగా పారశీకానికి (ఇరాన్) వ్యతిరేకంగా ఫ్రిజియా దేశానికి తన సాయమందించాడు. అందువల్ల పారశీక దేశం ఏథెన్స్‌పై పగ పట్టింది.

చివరకు ఏథెన్స్ పారశీకంతో ఘర్షించకుండా ఒక శాంతి ఒడంబడిక చేసుకుంది. దాని ప్రకారం అది తన నియంత్రణలో ఉన్న కొన్ని రాజ్యాలకు స్వయం నిర్ణయాధికారం

ఇచ్చింది. ఇందువల్ల ఏథెన్స్ నిజానికి ఒంటరిదైపోయింది. అయితే పారశీకం ఏథెన్స్‌ను వదలి దానికి దగ్గరలోని గ్రీసుపై దండెత్తింది. దాన్ని తన పాదాక్రాంతం కూడా చేసుకుంది. దీని పర్యవసానంగా మాసిడోనియా రాజు ప్రథమ అలెగ్జాండర్ అప్పుడు గ్రీసుకు కూడా అధిపతి అయ్యాడు.

ఆయన తరువాత పెర్టికాస్ రాజయ్యాడు. అతని తరువాత ఆర్కిలాస్ పాలకుడయ్యాడు. ఇతని కాలం క్రీస్తుపూర్వం 413-339. ఈయనే టెసా అనే ప్రాంతం నుంచి రాజధానిని బెల్లాకు మార్చాడు. (తరువాతి కాలంలో ఇక్కడే మహా అలెగ్జాండర్ జన్మించాడు.) బెల్లా నగరంలో విద్య, కళలు చక్కగా వర్థిల్లాయి. ఆర్కిలాస్ మహారాజు దేశాన్ని ప్రగతి పథానికి తీసుకెళ్లాడు. ఇతని తరువాత ద్వితీయ అలెగ్జాండర్ రాజ్యపాలన చేశాడు. తరువాతి రోజుల్లో థీప్స్ రాజు ఫిలిప్ మాసిడోనియాపై దండెత్తి అక్కడి రాజకన్య అయిన ఫిలిపినాను పెళ్లాడాడు. అక్కడ ఫిలిప్ అనేక సంవత్సరాలు సార్థకమైన విద్యనభ్యసించాడు. అయితే మాసిడోనియాలోని రాజును ప్రత్యర్థులు సంహరించినందువల్ల ఫిలిప్ మాసిడోనియాకు వేగిరం వెళ్లాడు. అక్కడ అప్పటి రాజుకు అతడు రక్షకుడయ్యాడు.

ఆనాడు మాసిడోనియాలో ఎన్నో రాజకీయ స్పర్థలు, గందరగోళాలు, కొట్లాటలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. వాటన్నింటినీ ఫిలిప్ చాకచక్యంగా ఉపయోగించుకుని, దాంతోపాటు ఇరుగుపొరుగు రాజ్యాలపై దాడి వెడలి గొప్ప విజేతగా నిలిచాడు. క్రీస్తు పూర్వం 356 నాటికి అతడు మాసిడోనియాకు ఎదురులేని పాలకుడయ్యాడు. ఇతడు ఆ దేశాన్ని సమర్థవంతంగా పాలించటమే కాక యుద్ధ తంత్రాల్లో 'బాలక్స్' అనే నూతన ప్రక్రియను కనుగొని ఎన్నో విజయాలు సాధించాడు.

క్రీస్తు పూర్వం 341లో థ్రేస్ దేశాన్ని గెలుపొందాడు. తన దేశ సరిహద్దులను విస్తరింపజేశాడు. క్రీస్తు పూర్వం 356లో ఫిలిప్- ఒలింపియా దంపతులకు పుత్రోదయమయ్యింది. రాజు ఫిలిప్ ఆ శిశువుకు అలెగ్జాండర్ అని నామకరణం జేశాడు. అలెగ్జాండర్ అనగా ప్రపంచ విజేత అయిన కుమారుడని అర్థం. అతని భవిష్యత్తు కల నిజమయ్యింది. తరువాతి కాలంలో అత్యంత పిన్న వయస్సులోనే ఫిలిప్ సైతం ఊహించని విధంగా అలెగ్జాండర్ ప్రపంచంలోని మూడు ఖండాలను తన పాదాక్రాంతం చేసుకున్నాడు. చరిత్రలో మహావీరుడిగా కీర్తిని గడించాడు. మహా అలెగ్జాండరయ్యాడు.

మహా అలెగ్జాండర్ సాధించిన విజయాలకు, పొందిన కీర్తి ప్రతిష్టలకు, సాటిలేని సాహస కార్యాలకు తండ్రి ఫిలిప్ వివేకం, విచక్షణ, జ్ఞానం, సామర్థ్యం, విద్యాబుద్ధులు ఉపకరించాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తండ్రి చెక్కిన శిల్పమే ఈ కుమారుడు.

# చరిత్ర గడియారంలో కాల గణన : ఒక చిన్న వివరణ

చరిత్రలో క్రీస్తు పూర్వం/ క్రీస్తు వెనుక అన్న పదాలు ఎక్కువగా వస్తుంటాయి. దీనర్థం క్రీస్తు పుట్టుకకు పూర్వం అని, క్రీస్తు పుట్టుకకు తరువాత అని.

క్రీస్తు పూర్వానికి చెందిన కాలగమనంలో ఒకరి పుట్టుక, మరణాన్ని సూచించే సంవత్సరాలు వ్యతిరేక దిశలో వెళ్లటాన్ని గమనించొచ్చు. ఉదాహరణకు క్రీస్తు పూర్వం 356లో జన్మించిన మహా అలెగ్జాండర్ క్రీస్తు పూర్వం 323న మరణించిన దాన్ని గమనించొచ్చు. ఇది కొందరిని ఆశ్చర్య పరచొచ్చు. ఇందుకు కారణమేమంటే చరిత్ర కారులు ఈ పద్ధతిని గణనకు సౌలభ్యంగా పరిగణిస్తారు. అందుకే ఇలాంటి కాల గణనను చరిత్ర గడియారంలో విభజించారు. ఈ అంశం ఈ క్రింద మరింత స్పష్టంగా అవగాహన అవుతుంది.

# మహా అలెగ్జాండర్

క్రీస్తు పుట్టుకకు పూర్వం 356 సంవత్సరాల నాడే జన్మించి 33 ఏళ్లలోనే మూడు ఖండాలను యుద్ధాలలో జయించిన చక్రవర్తి అలెగ్జాండర్. అందువల్లే నేడు ప్రపంచ చరిత్ర అతడిని మహా అలెగ్జాండర్ అని కీర్తిస్తోంది.

అలెగ్జాండర్‌లో ఎన్నో సుగుణాలున్నాయి. చురుకుదనంతో పాటు వివేకం, మగటిమితోపాటు ఆధ్యాత్మికత, నిగర్వమైన మానవత, మహిళలను కాంక్షించకపోవటం, వారిని చూడగానే గౌరవ దృక్కులతో వారితో ప్రవర్తించటం- ఇలాంటి స్వభావంతో ప్రపంచంలోనే మహా చక్రవర్తిగా వెలుగొందాడు మహా అలెగ్జాండర్. అతడు తాను జన్మించిన గ్రీస్ దేశంలోని మాసిడోనియా వదలి 20ఏళ్ల వయస్సులోనే వింటినుంచి వెలువడిన బాణంలాగా ప్రపంచంలో దూసుకెళ్లాడు.



శిలారూపంలో అలెగ్జాండర్

అతడి జైత్ర యాత్రలో 10వేల మంది సైనికులు మాత్రమే ఉన్నారు. అయినా 11 వేల మైళ్ల దూరాన్ని, 70 నగరాలను, మొత్తం 20లక్షల చదరపు

మైళ్ళ విస్తీర్ణాన్ని అతడు జయించినప్పుడు మూడు ఖండాలలో విస్తరించినట్లయ్యింది. వింటి నుంచి దూసుకుపోయిన బాణం మరలా తిరిగి రానట్లే మహా అలెగ్జాండర్ తన మాతృదేశానికి తిరిగే రాలేదు.

అతడు తాను దిగ్విజయ యాత్ర చేసిన దేశాలలోని నాగరికతను, సంస్కృతిని ఆసక్తితో అభ్యసించాడు. అందువల్లే ఇతడి చరిత్ర మనకు ఒక ఖచ్చితమైన ప్రపంచ చరిత్రను అందిస్తుంది.

మూడు ఖండాలను తన ఏలుబడిలో తెచ్చుకున్న అలెగ్జాండర్ ఏనాడూ అదో గొప్ప విషయంగా భావించలేదు. ఇందుకు ముఖ్య కారణం అతడి తీవ్రమైన అభిలాష భారతదేశాన్ని కనుగొనటం, దానికి విజేతగా నిలబడటం.ఆ కాలంలో పాశ్చాత్య దేశాలకు, ఇతర దేశాలకు 'ఇండియా(భారత్)' అన్నది స్వర్గ ధామంగా విలసిల్లుతోంది.

సింధూ మైదానం, హిందూఖుష్ పర్వతాలు గల భారతదేశం అంటే ఆధ్యాత్మికత భావన కలవారు, దేశాన్ని జయించాలనే కోరిక గలవారు భారతదేశాన్ని పాదాక్రాంతం చేసుకోవాలని ఉవ్విళ్ళూరారు. భూగోళంలోని పశ్చిమదిశ నుంచి సముద్ర మార్గంలో ఎందరో ఇండియాకు పయనమయ్యారు. అయితే మొట్టమొదటిగా భూ మార్గం గుండానే భారతదేశాన్ని సమీపించిన వాడు మహా అలెగ్జాండరే.

ఇతడి తండ్రి మాసిడోనియా రాజైన ఫిలిప్ సైతం భారతదేశాన్ని జయించాలనే కల కన్నవాడే. అతడే పుత్రుడికి ఇండియా గురించి వర్ణించి, వర్ణించి చెప్పి అతడిలో కూడా భారతదేశ సందర్శన కోరికను పెంపొందింప చేశాడు. ఆ కోరిక అలెగ్జాండర్ మనస్సులో చివరి వరకు ఎర్రగా మండుతూనే ఉంది.

అతడు మొదట తన కోరికను తీవ్రతరమైనదిగా మార్చుకున్నా దానిని సఫలం చేసుకునేందుకు ఓపిగ్గా, నెమ్మదిగా వివేకవంతులైన సహాయకుల సలహాలు స్వీకరించి తన మహా ప్రస్థానం సాగించిన వాడు అలెగ్జాండర్. ఆ కాలంలో రోమన్ దేశస్తులు గడ్డం పెంచుకోవడం అలవాటుగా ఉండేది. అయితే అలెగ్జాండర్ ఏనాడూ గడ్డం పెరగనీయలేదు. శుభ్రంగా క్షవరం చేసుకుని గంభీరంగా కనబడేవాడు. వేలాది సైనికులకు మంచి స్నేహితుడిగా, చక్కటి నిర్వాహకుడిగా చివరి వరకూ ఉన్నాడు.

తన తండ్రి కోరికను నెరవేర్చేందుకు తన అత్యంత వైభవోపేతమైన రాజభవనాన్ని వీడి సాహసయాత్రను ప్రారంభించాడు అలెగ్జాండర్. తన గైర్హాజరీలో పాలనా బాధ్యతను

తన తల్లికి అప్పగించేసి జైత్రయాత్ర కొనసాగించాడు. అక్కడక్కడా తాను సంపాదించిన అద్భుతమైన వస్తువులను తల్లికి కానుకలుగా పంపిస్తూ వచ్చాడు. ఇలా అలెగ్జాండర్ తన తల్లిదండ్రుల పట్ల బాధ్యతను నెరవేర్చుతూ వచ్చాడు. విజయం సాధించేందుకు అతడు అప్పుడప్పుడూ కొన్ని తప్పుడు మార్గాలు కూడా అనుసరించే వాడు. అయితే వాటిని కూడా తప్పక గ్రంథస్తం చేయాలని తన చరిత్ర కారులను ఆదేశించేవాడు. ఇది అతనిలోని ప్రత్యేకతను సూచిస్తుంది.

కొన్ని సందర్భాలలో అతడు కొందరు దుర్మతుల సలహాలను అనుసరించి వైపరీత్యాలకు కూడా పాల్పడేవాడు. అయితే వీటిని అతడు తన సొంత బుద్ధితో చేసే వాడు కాదు. అతని చుట్టూ ఉన్న మంత్రులు, ప్రధానుల నిర్బంధానికి తలొగ్గి చేసేవాడు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్నప్పుడు అతడిని 'మహా అలెగ్జాండర్' అని సంబోధించేందుకు కొంచెం కూడా సంశయించాల్సిన అవసరం లేదు.

ఒక సందర్భంలో పారశీక చక్రవర్తి డేరియస్‌ను జయించి ఆ దేశాన్ని పాదాక్రాంతం చేసుకున్న తరువాత అలెగ్జాండర్ తన మిత్రులతో రాజ భవనం ప్రవేశించాడు.


చిన్నారి అలెగ్జాండర్

అప్పుడు రాజమాత హెబాస్టిన్ అన్న అలెగ్జాండర్ మిత్రుణ్నే అలెగ్జాండర్ అని భావించుకుని ప్రవర్తించటం ప్రారంభించింది. ఆ సందర్భం అందరికీ ధర్మ సంకటంగా అనిపిస్తోంది. అయితే అలెగ్జాండర్ 'ఒక విధంగా హెబాస్టిన్ సైతం అలెగ్జాండరే.' అని చెప్పి అప్పటి వాతావరణాన్ని మామూలు స్థాయికి తెచ్చేశాడు. దీనిని బట్టి అతడిలోని సమయోచిత బుద్ధి, వినయం ప్రస్ఫుటమవుతాయి. సాదాసీదాగా జీవించినా మహా చక్రవర్తి అలెగ్జాండర్‌లో ఇలాంటి గొప్ప గుణాలెన్నో నిండున్నాయి.

## మాసిడోనియా

పశ్చిమాన రోమ్ దేశం, తూర్పున నల్ల సముద్రం మధ్యనున్న రాజ్యమే మాసిడోనియా. రోమన్‌లు

మాసిడోనియాను లక్ష్యపెట్టేవాళ్లు కారు. కొంత చులకనగా కూడా మాసిడోనియన్లను చూచేవారు. మాసిడోనియాను ఒలింపిక్స్ క్రీడల్లో కూడా అనుమతించే వారు కాదు. అయినా రోమన్లకు ఏ విధంగానూ మేము తక్కువైన వారం కాదు అని నిరూపించే విధంగా మాసిడోనియా రాజు రెండో పిలిఫ్ అనేక రాజ్యాలను దాడి చేసి జయించాడు. పిలిఫ్ పట్ల ప్రజల ఆదరాభిమానాలు అపారం. ఎన్నో నగరాలు మాసిడోనియా పాదాక్రాంతమయ్యాయి. గెలుపు ఉత్సాహంలో మునిగి తేలుతున్న రాజుకు ఒక శుభ సందేశం కూడా అందింది. ఆయన సొంత ఊరైన బెల్లాలో రాణి ఒలింపియస్‌కు పుత్రోదయం కలిగిందని వచ్చిన వార్తే అది. రాజు ఆనందానికి అవధులు లేకపోయాయి. తనకో వారసుడు జన్మించాడని సంతోషపడిపోయాడు.

అప్పుడే 'పోసోపియా' నగరాన్ని జయించి ఆనంద డోలికల్లో ఊగుతున్న రాజుకు కుమారుడు కలిగిన సంతోషం కూడా రెండింతలు అనిపించింది. అంతే, ఆ ప్రాంతమంతా మిత్రులతోనూ రాజసేవకులతోనూ ఉత్సవ వాతావరణం నెలకుంది. సైనికులకు రాజు విలువైన బహుమతులిచ్చాడు.

రాజు వెంటనే తన సైన్యాన్ని బెల్లాకు తీసుకెళ్లాడు. ఆయనకు వారసుడు జన్మించిన తేదీ క్రీస్తు పూర్వం 356వ సంవత్సరం జూలై 26.

రాణి ఒలింపియస్ మాత్రం తన నవజాత శిశువుకన్నా పాముల పట్లే ఎక్కువ మక్కువ చూపించేది. రాజు పిలిఫ్ రకరకాల ఆలోచనలతో రాత్రింబవళ్లు ప్రయాణించి బెల్లాకు తిరిగి వచ్చాడు. మరింత వేగంగా ప్రయాణించాలని తన సైనికులను బలవంత పెడుతున్నాడు.

కుమారుణ్ని చూడబోతామనే ఉత్సాహం ఎంతగా ఉన్నా, తన భార్యను తలచుకోగానే రాజు ఎంతో ఒత్తిడికి లోనయ్యాడు. ఆ బాధ తప్పని సరి. ఒలింపియస్ మొండిపట్టుదలకు, అహంకారానికి ప్రతి రూపంగా ఉంది. తన మనస్సులాగే పాములను పెంచటంలో అత్యంత ఆసక్తి చూపుతోంది. అలాంటి భార్య ఏ భర్తకు నచ్చుతుంది..? కానీ పుట్టిన బిడ్డను తలచుకుంటే మాత్రం రాజుకు ఎంతో విచారం కలుగుతోంది. అయినా వాడిని మాత్రం తన సంపూర్ణ పర్యవేక్షణలో ఉంచుకుని సాటిలేని వీరుడిగా రూపొందించాలని నిశ్చయించుకున్నాడు. ఇలాంటి ఆలోచనలతో సతమతమవుతూ రాజు బెల్లా నగరం సమీపించాడు. ఆ నగరం మొత్తం జాతర జాతరగా ఉంది. ప్రజల జయజయధ్వానాలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

రాజు అంతఃపురం ప్రవేశించి శిశువును చేతుల్లోకి తీసుకుని ఆనందించాడు. చేతుల్లో కదులుతోన్న బిడ్డ ఆయనకు ఎంతో సంతోషం కలుగజేస్తున్నాడు. బిడ్డను గుండెకు గట్టిగా అదుముకుని భవిష్యత్తు కలలో కూరుకుపోయాడు. 'వీడే మా పూర్వీకులైన అఖిలస్, హెర్క్యులస్ లాంటి వారి కీర్తిని నిలబెట్టేవాడు.' అనుకున్నాడు రాజు. అక్కడి వారందరూ శిశువును ఆశీర్వదిస్తుండగా, రాజు మహావీరుడిగా పరిణమించబోయే ఆ బిడ్డకు 'అలెగ్జాండర్' అంటూ నామకరణం చేశాడు. అలెగ్జాండర్ అంటే 'విజయ వీరపుత్రుడు' అని అర్థం. అంతే, వెంటనే అందరూ ఏక కంఠంతో అలెగ్జాండర్, అలెగ్జాండర్ అంటూ నినదించారు.

రాజు అక్కడ ఉన్నవారందరికీ మంచి మంచి బహుమతులు పంచి పెట్టాడు. అందరూ ఆనంద సాగరంలో మునకలు వేశారు. ఆరోజే సైనికులు రాజుకు మరో సంతోషకరమైన వార్తను తెచ్చారు. 'ఇల్లీరియా' రాజ్యంపై మన సైన్యం దాడి చేసి దాన్ని స్వాధీనం చేసుకుందనే వార్తే అది. మన సైన్యాధ్యక్షుడు 'పార్మీనియో' దీన్ని సాధించి పెట్టాడన్నారు వారు. రాజు పిలిఫ్ మరింత సంతోషించి 'నాకు జన్మించిన కుమారుడు బహుమతితోనే వచ్చాడు.' అని ప్రకటించగా అందరూ హర్షాతిరేకాలు గావించారు.

అలెగ్జాండర్‌కు ఆరేళ్ల ప్రాయంలో విద్యాబుద్ధులు నేర్పించేందుకు 'లియోనిటస్' అనే గురువును రాజు నియమించాడు. ఆయన తత్వశాస్త్రంతో పాటు క్రీడలను కూడా నేర్పించాడు. ఈ గురువు మహారాణి ఒలింపియస్‌కు కూడా బంధువే. అయితే మహారాజు పట్ల అతనికి అత్యంత గౌరవ భావం, విశ్వాసం. ఆయన ఒలింపియస్ స్వార్థాన్నీ అహంకారాన్నీ బాగా ఎరిగిన వాడు.

రాజు పిలిఫ్ ఎల్లప్పుడూ అలెగ్జాండర్‌కు ధైర్యాన్ని, సాహసాన్ని, నిజాయితీని నూరిపోస్తుండేవాడు. ఆటల్లోనైనా సరే యుద్ధాల్లోనైనా సరే, ఎక్కడైనా సరే విజయాన్ని మాత్రమే లక్ష్యం చేసుకుని ప్రయత్నించాలనేవాడు. ఆ ఒరవడిలోనే గురువు లియోలిటస్ కూడా విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాడు. వాటితో పాటు దుబారా లేకుండా పొదుపుగా ఒక పని చేయడమెలాగో కూడా బోధించేవాడు. సాధారణంగా అలెగ్జాండర్ తన ఆరాధ్య దైవమైన 'సీయస్' దేవుడికి ధూపం వేసేటప్పుడు సాంబ్రాణి దుబారాగా వెదజల్లేవాడు. అప్పుడు గురువు 'నీ తండ్రి యుద్ధాలు చేసి సంపాదించుకొచ్చిన సాంబ్రాణిని ఇలా దుబారాగా వెదచల్లటం కన్నా, నీవే స్వయంగా యుద్ధాలు చేసి సాంబ్రాణిని సంపాదించటం ఉత్తమం కదా..?' అంటూ మందలించేవాడు. ఇందువల్ల అలెగ్జాండర్‌లో పొదుపరి

తనం పాదుకొంది. సాంబ్రాణిని మాత్రమే కాదు, తండ్రి సంపాదించిన ప్రతి వస్తువునూ వారసత్వంగా పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని అలెగ్జాండర్ అర్థం చేసుకున్నాడు. అతడు గురువు గారికి కృతజ్ఞతలు తెలియజేయగా, లియోలిటస్ తన శిష్యుడి విశాల హృదయాన్ని గమనించి గర్వించాడు.

ఒక రోజు రాజు పిలిఫ్ అలెగ్జాండర్ బుద్ధి చాతుర్యాలు వృద్ధి చెందటాన్ని చూచి ఆనందిస్తున్నాడు. తదనంతరం కుమారుణ్ని తీసుకుని అంతఃపురం మేడమీదికెళ్లాడు. అక్కడ అలెగ్జాండర్‌కు తూర్పు దిక్కును చూపిస్తూ 'ఇదిగో ఈ తూర్పు దిక్కును జాగ్రత్తగా చూడు. ఈ దిశలోనే ఇండియా అనే దేశం ఉంది. అది అత్యంత సారవంతమైనది, సుసంపన్నమైంది. ఆ దేశాన్ని జయించాలనేదే నా చిరకాల వాంఛ. ఆ భారతదేశం గురించి విన్నప్పుడల్లా నా మనస్సు పొంగిపోతుంది. ఆధ్యాత్మికతలో, రాజకీయాల్లో భారతీయులు ముందంజలో ఉన్నారు. నా జీవితంలో ఒక్క రోజైనా ఆ ఇండియాలో గడపాలని ఉంది. నా కల నిజం కాకపోయినా నీకు ఆ అదృష్టం దక్కాలి.' అంటూ పరిపరివిధాలా చెప్పసాగాడు. అలెగ్జాండర్ ఆశ్చర్యంగా తండ్రిని తదేకంగా చూస్తూ నిలబడిపోయాడు.

పిలిఫ్ రాజు విజయపరంపరలు అందుకుంటూ తన మాసిడోనియా రాజ్య సరిహద్దులను విస్తరించుకుంటూ పోయాడు.



**అలెగ్జాండర్ తల్లి ఒలింపియస్**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Great+Alexander**

* * *